క్లుప్తంగా

నేడు గౌరెల్లిలో సుదర్శన హోమం



మూలవిరాట్

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపల్ పరిధిలోని గౌరెల్లిలో కొలువైన శ్రీ స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద శుక్రవారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నెల్లూరి రాజు, వైస్ చైర్మన్ చెంచలి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, సుదర్శన హోమాన్ని నిర్వహిస్తారని ఓ ప్రకటనలో వివరించారు. కార్యక్రమానికి కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

బస్ పాసుల అందజేత



కుర్మిద్దలో దివ్యాంగులకు బస్ పాసులు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో గురువారం హైదరాబాద్ ఆర్టీసీ డిపో–2కు చెందిన అధికారులు దివ్యాంగులకు బస్ పాసులను అందజేశారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు మల్కాపురం శివశంకర్ ఆధ్వర్యంలో 50 మందికి పాసులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆర్టీసీ అధికారులు అంజయ్య, శివరాజ్‌గౌడ్, దివ్యాంగులు మహేందర్, సుజాత, బాలమ్మ, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



వైస్ చైర్మన్, డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ నరేశ్‌నాయక్‌ను గురువారం గిరిజన సేవా సంఘం, సేవాలాల్ సేన సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు లక్పతినాయక్, నాయకులు భీముడు నాయక్, లక్ష్మణ్‌నాయక్, జంగయ్య, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహాపడిపూజ



మహాపడిపూజలో స్వాములు, భక్తులు

కడ్తాల్: మండల కేంద్రంలో కాంటేకర్ మనోహర్–మాధవి దంపతుల ఆధ్వర్యంలో గురుస్వాములు మల్లారెడ్డి, విజయ్, రాజు, మహేశ్, సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో మహాపడి పూజ కార్యక్రమాన్ని గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ స్వాములు ఆలపించిన గీతాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు శంతన్‌స్వామి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

స్వయం సేవకుల చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

తలకొండపల్లి: సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆరెస్సెస్ శివాజీ శాఖ ఆధ్వర్యంలో గట్టుఇప్పలపల్లికి చెందిన పెంట మల్లకు మహేశ్ ఇంటి నిర్మాణానికి సాయం చేశారు. స్వయం సేవకులు విరాళాల ద్వారా సేకరించిన రూ. 20,000 అతనికి అందజేశారు. కార్యక్రమంలో జినుకంట్ల భాస్కర్, సాయిరాం, ప్రవీణ్, అరుణ్, నరేష్, శివ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం

- వ్యవసాయ అనుబంధ పనులకు శ్రీకారం
- ఉద్యాన వన పంటలు ప్రోత్సాహకం
- గ్రామాల్లో మౌలిక సదుపాయ కల్పనకు పెద్దపీట



కోళ్ల షెడ్ల పనులకు శ్రీకారం చుడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: మహాత్మాగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. కూలీలకు పనులు కల్పించేందుకు ప్రస్తుతం వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పనులను చేయడానికి నిర్ణయించింది. 2024–25 సంవత్సరానికి గాను ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. గ్రామాల్లో ప్రజలకు పనులు కల్పించడంతో పాటు మౌలిక వసతులు సమకూర్చడానికి వీలుగా వెసులుబాటు చేసింది. ఇప్పటికే కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధికి బాటలు వేసింది.

వ్యవసాయ అనుబంధ పనులకు శ్రీకారం

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలు, రైతులకు ఆర్థిక ప్రగతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ, ప్రకృతి వనరులను కాపాడటం కోసం 34 రకాల పనులను అందుబాటులోకి తీసుకొచ్చింది. మిషన్ వాటర్ కంసర్వేషన్ మండలాలు, బ్లాక్‌లతో పాటు వ్యక్తిగత పనులు చేయనున్నారు.

కార్యక్రమాలు ఇవే

ఇందిర మహిళా శక్తి: ఉపాధి హామీ పథకంలో పశువులు, కోళ్ల షెడ్లు నిర్మాణం చేయడానికి అనుమతులు ఇచ్చారు. స్వయం సహాయక సంఘాలు కోళ్లు, గేదెలను బ్యాంకు రుణాల ద్వారా కొనుగోలు చేసే అవకాశం కల్పించారు. అలాగే పశువులకు వేసే అజోల్లా పిట్స్, వర్మి కంపోస్టు పిట్స్, చిన్న తరహా ఎస్సీ, ఎస్టీ రైతుల భూములు చదును చేసే పనులు ఇందులో ఉన్నాయి.

పొలం బాటలు: గ్రామాల్లో వ్యవసాయ పొలాలకు కొత్తగా రవాణా సౌకర్య కల్పనకు నిధులు వెచ్చించడం. వనమహోత్సవం: ఇందులో ఈత, తాటి వనాలు పెంపకం. అలాగే మామిడి, జామ, సపోట, దానిమ్మ లాంటి మొక్కలు నాటి తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

జలనిధి: నీటి వనరులను పరిరక్షించడం. గల్లీ కంట్రోల్ పనులు, చెక్‌డ్యాంలు, ఫారంపండ్, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రిసోర్సింగ్ వాల్ నిర్మాణం పనులు చేయాల్సి ఉంది.

రైతులు వినియోగించుకోవాలి



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాల నుంచి మండలాలకు ఇప్పటికే పనులు అప్పగించారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం రూపకల్పన చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా తీసుకొచ్చిన ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

– వెంకటమ్మ, ఎంపీడీఓ, ఇబ్రహీంపట్నం

మౌలిక సదుపాయల కల్పన: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో బాలికల కోసం మూత్రశాలలు నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణం, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మాణం కోసం ఈ నిధులు ఉపయోగించాలి.

మార్చి నాటికి పనులు పూర్తి

ఉపాధి హామీ పథకంలో ప్రవేశ పెట్టిన ఈ పనులు 2024–25 సంవత్సరానికి గాను చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు గాను ప్రతి మండలానికి లక్ష్యాన్ని నిర్దేశించి పనులు ప్రారంభిస్తున్నారు. వ్యవసాయ అనుబంధ పనులతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించే పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలంలో కోళ్ల షెడ్డు నిర్మాణం కోసం జిల్లా ప్రాజెక్టు అధికారి ఈ నెల 26వ తేదీన ఎల్మినేడు గ్రామంలో పనులు ప్రారంభించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



యాచారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్

- వంట ఏజెన్సీ సిబ్బందికి రూ.10 వేల వేతనం ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీశ్

యాచారం: అప్పులు చేసి విద్యార్థులకు వండి పెడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీశ్ అన్నారు. మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం యాచారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు వండి పెట్టేందుకు ఏజెన్సీల నిర్వాహకులు అనేక కష్టాలు పడుతున్నారన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెరిగిన చార్జీలకు అనుగుణంగా బిల్లులు పెంచాలని, ఎన్నికల హామీ మేరకు వంట సిబ్బందికి రూ.10 వేల వేతనం ఇవ్వాలన్నారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు బ్రహ్మయ్య, మండల కన్వీనర్ చందునాయక్, వివిధ గ్రామాల వంట సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో వైద్యసేవలందించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి



హోమియోపతి ఆస్పత్రిలో బీపీ చెకప్ చేయించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఇబ్రహీంపట్నం: మానవతా దృక్పథంతో వైద్యసేవలందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. గురునానక్ హోమియోపతి మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఉచిత హోమియోపతి వైద్యశాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతంలోని పేదలకు వైద్య సహాయం చేయాలన్నారు. అనేక దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే సామర్థ్యం హోమియో వైద్య విధానంలో ఉందన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, పవన్‌సాయి ఆస్పత్రి డైరెక్టర్లు సతీశ్, ప్రియదర్శిని, హోమియో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రిన్సిపాల్ డా.రేణుక, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య



నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

కడ్తాల్: కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం కేజీబీవీని భోజన విరామ సమయంలో సంఘం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్న నేపథ్యంలో వారికి మినిమం బేసిక్ పే ఇవ్వాలని, స్పెషల్ ఆఫీసర్ ప్రిన్సిపాల్‌కు అందించే వసతులు, వేతనం కల్పించాలని కోరారు. ఇతర ఉద్యోగుల మాదిరిగానే సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని, డిసెంబర్ 9 నుంచి 13 వరకు సీఎంకు లేఖలు, డిసెంబర్ 22 నుంచి 25 వరకు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. జనవరి 7న కలెక్టరేట్ కార్యాలయాల సామూహిక నిరాహారదీక్ష, జనవరి 28న హైదరబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమస్యలు ప్రభుత్వం పరిష్కరించని యెడల ఫిబ్రవరిలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షురాలు కౌసల్య, నాయకులు మల్లయ్యగౌడ్, భీముడు, నర్సింహమూర్తి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

యోగాతో అనేక ప్రయోజనాలు

- ఆయుర్వేద డాక్టర్ శ్రీకాంత్
- తలకొండపల్లిలో ఉచిత యోగా శిక్షణ ప్రారంభం



తలకొండపల్లిలో యోగా శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

తలకొండపల్లి: యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆయుర్వేద డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. యోగా సాధనతో పలు ఆరోగ్య ప్రయోజనాలుంటాయని పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, అనుసంధానంగా యోగా శిక్షణా కేంద్రాన్ని తలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రారంభించారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, ప్రతీ రోజు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యోగాతో మెదడు పనితీరు మెరుగు పడుతుందని, రక్తపోటును తగ్గిస్తుందని, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని మెరుగు పర్చుతుందని, ఆందోళనలను దూరం చేస్తుందని, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని, వృద్ధాప్యాన్ని ఆలస్యం చేయడంలో సహయపడుతుందని, రోజు వారి యోగాభ్యసనంతో నాడీ వ్యవస్థ మెరుగుపడి ప్రశాంతత, మెరుగైన ఏకాగ్రత ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య

కడ్తాల్: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కేంద్రం వద్ద సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి ఎంఈఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్షురాలు లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి, బుజ్జమ్మ, బాలమణి, బాలమ్మ ఉన్నారు.

సర్వేకు సహకరించండి

ఇబ్రహీంపట్నం రూరల్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని, సర్వే చేయించుకోని వారు వెంటనే పూర్తి చేసుకోవాలని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే మున్సిపాలిటీలో చివరిదశకు చేరిందన్నారు. ఇప్పటి వరకు 5,105 కుటుంబాలను గుర్తించగా అందులో 4,693 కుటుంబాల్లో 91.9శాతం సర్వే పూర్తి చేశామని వివరించారు. రెండుమూడు రోజుల్లో సర్వే ముగుస్తుందన్నారు. ఇప్పటికీ పేర్లు నమోదు చేసుకొని కుటుంబాలు ఏమైనా ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని కోరారు. ఎన్యూమరేటర్లు మీ ఇంటికి వచ్చి వివరా లు నమోదు చేస్తారని తెలిపారు. సలహాలు, సూచనల కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని 6303435647 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఎన్యుమరేటర్ మీ ఇంటికి రాకపోయినా పైనంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనాలు అందించాలి

- యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన



కేజీబీవీ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

మహేశ్వరం: కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగులకు కనీస వేతనం, ప్రభుత్వ అలవెన్సులు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కందుకూరు మండల కేంద్రంలోని కేజీబీవీలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా కేజీబీవీ, సర్వశిక్ష ఉద్యోగ ఉపాధ్యాయులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ఇబ్రహీంపట్నం రూరల్: గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సురంద్రరావు దస్తకర్ డాక్టరేట్ అందుకున్నారు. విజయవాడలోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కె ఎల్ డీమ్డ్ టు యూనివర్సిటీ)లో డెప్త్ డేటా అసిస్టేట్ హ్యూమన్ యాక్షన్ రికగ్నైజేషన్ అంశంపై ఆయన చేసిన పరిశోధనలకు గానూ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా కాలేజీ నిర్వాకులు దస్తకర్‌ను అభినందించారు.

నేడు బీఆర్‌ఎస్ దీక్షాదివస్

ఆమనగల్లు: శంషాబాద్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఈనెల 29న నిర్వహించే దీక్షాదివస్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఒక ప్రకటనలో కోరారు. మాజీ సీఎం కేసీఆర్ నవంబర్ 29న ఆమరణ దీక్ష ప్రారంభించి, తెలంగాణ రాష్ట్రం సాధించారని వారు గుర్తుచేశారు. కేసీఆర్ దీక్ష ప్రారంభించిన రోజు పురస్కరించుకుని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షాదివస్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన



తలకొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

తలకొండపల్లి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కస్తూర్బా గురుకుల బాలికల విద్యాలయ ఉపాధ్యాయులు గురువారం నిరసన చేపట్టారు. భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ రేణుక, యాదమ్మ, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పాండురంగయ్య



ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండె పాండురంగయ్య నియమితులయ్యారు. గతంలోనూ రెండు పర్యాయాలు ఆయన మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేశారు.

దీక్షా దివస్‌ను జయప్రదం చేయండి

నందిగామ: బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు శంషాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దీవస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రతీ బీఆర్‌ఎస్ కార్యకర్త విధిగా హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నోముల పద్మారెడ్డి కోరారు. నందిగామలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ముందుగా మండల కేంద్రమైన నందిగామలో ఉదయం పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం శంషాబాద్‌కు తరలివెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూలే సేవలు చిరస్మరణీయం



తలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు



కడ్తాల్: జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- నాయకులు, ప్రజాప్రతినిధులు
- ఘనంగా నివాళి

తలకొండపల్లి: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పూలే సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ్మా, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, ఎమ్మార్పీస్ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ, గణేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి

కడ్తాల్: మండల కేంద్రంలో గురువారం మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. యువజన సంఘాల ఐక్యవేదిక, బీసీ సంక్షేమ సంఘం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సంఘ సంస్కర్త జ్యోతిరావుపూలే



ఇబ్రహీంపట్నం: పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఇబ్రహీంపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన సంఘ సంస్కర్త, మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కానుగుల మహేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జ్యోతిరావుపూలే వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు భర్తకి రాజు, చింతికింది జంగయ్య, నిట్టు మహేశ్, చందుకుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పుష్ప, నాగమ్మ, స్వరూపరాణిలు పాల్గొన్నారు.

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



తలకొండపల్లి కేజీబీవీలో విద్యార్థులకు కలిసి భోజనం చేస్తున్న అధికారులు

తలకొండపల్లి: వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహసీల్దార్ నాగార్జున అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని గురువారం ఆర్‌ఐ మంజులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతంతో పాటు, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తాజా కూరగాయాలతో వండిన ఆహార పదార్థాలను వడ్డించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రైతు మేళాకు తరలిరావాలి

కడ్తాల్: నేడు పాలమూరులో జరగనున్న రైతు మేళా సదస్సుకు కడ్తాల్ మండలం నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలిరావాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుమేళాలో ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ పరిజ్ఞానం, పంటల దిగుబడి, ఆధునిక వంగడాలు, అధిక ఉత్పత్తులు, ఆధునిక వ్యవసాయం, హైబ్రిడ్ వంగడాలు, యంత్రాలతో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రసంగాలు, విజయగాధలు, వీడియో ప్రదర్శనల ద్వారా రైతులకు వివరిస్తారని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై స్టాళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన అనేక అంశాలపై సమగ్రంగా వివరించేందుకు ప్రభుత్వం రైతు మేళాను నిర్వహిస్తుందని తెలిపారు. మండల కేంద్రం నుంచి శుక్రవారం ఉదయం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు రెండు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, 100 మంది వరకు రైతులు అట్టి మేళాకు హజరై, కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేయాలని కోరారు.

రైతు సదస్సులను జయప్రదం చేయండి

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 28నుంచి 30వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రైతు సదస్సు కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీం, జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక సభ్యుడు యాదగిరిలు గురువారం ఒక ప్రకటనలో కోరారు. మూడు రోజుల పాటు నిర్వహించే వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను తిలకించాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ తదితర అంశాలను వివరిస్తారని తెలిపారు. 30న ప్రజాపాలన విజయోత్సవ భారీ బహిరంగ సమావేశం జరుగుతుందని, అధిక సంఖ్యలో రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.